# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 09-10-2023 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబు నాయుడు స్కిల్ డెవలప్ మెంట్ కేసులో దాఖలు చేసిన క్వాష్ పిటిషన్ పై సుప్రీం కోర్టులో విచారణ రేపటికి వాయిదాపడింది.

- వ్యవసాయ ఉత్పత్తిలో మహిళల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు.

- ఆసియా క్రీడలలో పాల్గొన్న భారత అథ్లెట్ల బృందంతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రేపు ఢిల్లీలో సంభాషించనున్నారు.

- వచ్చే జనవరి 1 నుంచి ఆసరా పెన్షన్ మొత్తాన్ని మూడు వేల రూపాయలకు పెంచుతున్నట్లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రకటించారు.

- సాంప్రదాయ వైద్య విధానాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తున్నామని కేంద్ర ఆయుష్ శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్ తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబు నాయుడు స్కిల్ డెవలప్ మెంట్ కేసులో దాఖలు చేసిన క్వాష్ పిటిషన్ పై సుప్రీం కోర్టు ఈరోజు ఇరు పక్షాల వాదనల అనంతరం తదుపరి విచారణను ధర్మాసనం రేపటికి వాయిదా వేసింది. మరో వైపు స్కిల్ డెవలప్ మెంట్ కేసులో చంద్రబాబు పెట్టుకున్న బెయిల్ పిటిషన్ ను, సీఐడీ దాఖలు చేసిన కస్టడీ పొడిగింపు పిటిషన్ ను విజయవాడ ఏసీబీ కోర్టు కొట్టేసింది. చంద్రబాబుపై దాఖలైన పీటీ వారెంట్లపై ఏసీబీ కోర్టులో విచారణను రేపటికి వాయిదా వేసింది. ఇక ఇన్నర్ రింగ్ రోడ్డు, ఫైబర్ నెట్, అంగళ్లు అల్లర్ల కేసులకు సంబంధిచి చంద్రబాబు నాయుడు దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్లను ఈ రోజు రాష్ట్ర హైకోర్టు కొట్టివేసింది. ఇదిలా ఉండగా ఇన్నర్ రింగ్ రోడ్ కేసులో కొత్తగా మరో నలుగురు అధికారులను నిందితులుగా చేరుస్తూ, ఈ రోజు సీఐడీ మరో పిటిషన్ దాఖలు చేసింది. కాగా, అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు కేసులో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ రేపు సీఐడీ ఎదుట విచారణకు హాజరుకానున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

వ్యవసాయ ఉత్పత్తిలో మహిళల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. ఢిల్లీలో ఈ రోజు వ్యవసాయ రంగంలో పరిశోధన నుండి ప్రభావం అనే అంశంపై రాష్ట్రపతి మాట్లాడుతూ, వర్తమాన కాలంలో వ్యవసాయ ఆహార వ్యవస్థను మార్చడంలో అనేక మంది మహిళా పారిశ్రామికవేత్తలు కీలక పాత్ర పోషిస్తున్నారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ మాట్లాడుతూ, వ్యవసాయ రంగంలో వినూత్న పద్ధతులను ఉపయోగించడంతో పాటు, మహిళల భాగస్వామ్యం పెరగడం కూడా వ్యవసాయ ఆహార వ్యవస్థను బలోపేతం చేస్తున్నాయని అన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

ఆసియా క్రీడలలో  పాల్గొన్న భారత క్రీడాకారుల బృందంతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రేపు ఢిల్లీలో జరిగే సమావేశంలో సంభాషించనున్నారు. ఈ సందర్భంగా ఆసియా క్రీడలలో విశిష్ట విజయం సాధించిన క్రీడాకారులను ప్రధాన మంత్రి అభినందిస్తారని అధికార వర్గాలు తెలియజేశాయి. ఈ కార్యక్రమంలో భారత జట్టులోని అథ్లెట్లు, కోచ్‌లు, ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్ అధికారులు జాతీయ క్రీడా సమాఖ్య ప్రతినిధులు పాల్గొంటారు. ఇదిలా ఉండగా, ఆసియా క్రీడలలో 28 బంగారు పతకాలతో సహా భారతదేశం మొత్తం 107 పతకాలను గెలుచుకుంది.

= = = = = = = = = = = = = = = = = = = = =

వచ్చే జనవరి 1 నుంచి ఆసరా పెన్షన్ కింద ఇచ్చే మొత్తాన్ని మూడు వేల రూపాయలకు పెంచబోతున్నట్లుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రకటించారు. ఈ రోజు విజయవాడలో నిర్వహించిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సర్వసభ్య సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలో 87 శాతం మంది ప్రజలకు రెండు లక్షల ముప్పయి అయిదు కోట్ల రూపాయలను నేరుగా వారి ఖాతాల్లోకి జమ చేసామని వివరించారు. రాష్ట్రంలో విద్య, వైద్య, వ్యవసాయ రంగాల్లో సమూలమైన మార్పులు తీసుకొచ్చామని ముఖ్యమంత్రి పేర్కొంటూ....

(వాయిస్ 27 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = =

సాంప్రదాయ వైద్య విధానాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తున్నామని కేంద్ర ఆయుష్ శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్ తెలిపారు. ముంబైలో ఈరోజు జరిగిన జాతీయ ఆయుష్ మిషన్ ప్రాంతీయ సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కరోనా మహమ్మారి సమయంలో ఆయుష్ వ్యవస్థ అద్భుతమైన పనితీరు కనబరచిందని  ఫలితంగా ప్రపంచం ఇప్పుడు ఆయుష్ వ్యవస్థను గుర్తించిందని అన్నారు. దేశంలో సాంప్రదాయ వైద్యంలో 900 కంటే ఎక్కువ స్టార్టప్‌లు ఉన్నాయని కేంద్ర మంత్రి తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలోనే మొట్టమొదటి సారిగా ఫిల్మ్, టివి, థియేటర్ విభాగాలలో మాస్టర్ డిగ్రీ ని గుంటూరు జిల్లాలోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ప్రారంభించారు. విశ్వవిద్యాలయ ప్రాంగణంలోని డాక్టర్ ఎస్.పి.బాల సుబ్రమణ్యం స్కూల్ ఆఫ్ పెర్ఫార్మింగ్ అండ్ ఫైన్ ఆర్ట్స్ ప్రాంగణంలో ఈ కోర్సుల విభాగాలను విశ్వవిద్యాలయ ఉప కులపతి ఆచార్య రాజశేఖర్ ఈ రోజు ప్రారంభించారు. నిపుణుల ఆధ్వర్యంలో ఏర్చి కూర్చిన సిలబస్ విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దుతుందని ఆయా విభాగాల ఇన్‌ఛార్జ్ ప్రొఫెసర్  ఎల్.వి.భూషణ్ ఆకాశవాణికి తెలిపారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = =

స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని తిరుపతి జిల్లా కలెక్టర్ కె. వెంకటరమణా రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈరోజు కలెక్టరేట్ లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో గ్రీవెన్స్ అర్జీలను ఆయన స్వీకరించారు. వివిధ కారణాలవల్ల అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించడయే "జగనన్నకు చెబుదాం - స్పందన" కార్యక్రమ ముఖ్య లక్ష్యమని శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు తెలిపారు. ఈరోజు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 376 వినతులు వచ్చాయి. స్పందన అర్జీ దారులకు శాశ్వత పరిష్కారం చూపాలని సంబంధిత అధికార్లకు పశ్చిమగోదావరి జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి ఆదేశించారు. ఈరోజు భీమవరంలో ఏర్పాటు చేసిన స్పందన కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుండి వచ్చిన అర్జీదారులను జిల్లా కలెక్టరు స్వీకరించారు. స్పందనలో వచ్చిన ఫిర్యాదులకు తక్షణమే పరిస్కారం చూపాలని శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ శ్రీకేశ్ లాఠకర్ అన్నారు. శ్రీకాకుళం జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, ఇతర అధికారులతో కలిసి ఆయన స్పందన ఫిర్యాదులు స్వీకరించారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున కోరారు. జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా జీవీఎంసీ 28వ వార్డు, భానోజీ నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య వైద్యశాల వద్ద ఈరోజు వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరికీ ఉచిత ఆరోగ్య సేవలు అందించాలన్న ఉద్దేశంతోనే ఇంటింటికీ వెళ్లి వైద్య పరీక్ష నిర్వహించేలా చర్యలు తీసుకున్నట్లు తెలియజేశారు. విశాఖలో 200కు పైగా వైద్య శిబిరాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

విద్యార్థులు చిన్నతనం నుంచే పోటీ తత్వాన్ని అలవర్చుకోవాలని ఆంధ్రప్రదేశ్ నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్ రెడ్డి సూచించారు. పశ్చిమగోదావరి జిల్లా తణుకు పట్టణంలోని ఒక ప్రైవేటు పాఠశాలకు చెందిన 106 మంది విద్యార్థులు ఈరోజు ఏపీ నిట్ ప్రాంగణాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈనాటి పోటీ ప్రపంచంలో రాణించాలంటే ప్రతి విద్యార్థి వివిధ అంశాల్లో లోతైన విశ్లేషణ, వ్యక్తిగత నైపుణ్యాలను అభివృద్ధి పరుచుకోవాలని సూచించారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

నిరుద్యోగ యువత కోసం రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఎంప్లాయిమెంట్, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో కదిరిలో ఈనెల 13న జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు శ్రీ సత్యసాయి జిల్లా రెవెన్యూ అధికారి పి. కొండయ్య తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఈ రోజు జాబ్ మేళా పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఈ జాబ్ మేళాలో 14 కంపెనీలకు చెందిన యాజమాన్య ప్రతినిధులు పాల్గొంటున్నారని తెలిపారు. పదవతరగతి, ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని లబ్ధిపొందాలని కోరారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

టిటిడి పారిశుధ్య కార్మికుల జీతాలను 12 వేల నుంచి 17 వేలకు పెంచాలని తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి నిర్ణయించింది. టీటీడీ పాలక మండలి సమావేశాన్ని ఈ రోజు తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో నిర్వహించారు. అనంతరం టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి పాత్రికేయులతో మాట్లాడుతూ, 5 వేల మంది పారిశుధ్య కార్మికులకు జీతాలు పెంచనున్నట్లుగా ఆయన తెలియజేశారు. ఇకపైన అలిపిరి వద్ద ప్రతి నిత్యం శ్రీ శ్రీనివాస దివ్యానుగ్రహ విశేష హోమం నిర్వహిస్తామని, నారాయణగిరి ఉద్యానవనంలో కంపార్టుమెంట్లు ఏర్పాటు చేసేందుకు 18 కోట్ల రూపాయలు కేటాయించామని వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

ఉత్తర కోస్తా ఆంధ్ర ప్రదేశ్  పరిసర ప్రాంతాలపై సగటు  సముద్ర మట్టానికి 1.5 నుంచి 3.1 కిలో మీటర్ల ఎత్తులో ఉపరితల అవర్తనం ఆవరించి ఉందని భారత వాతావరణ కేంద్రం తెలియజేసింది. దీని ప్రభావంతో రాబోయే మూడు రోజులలో ఉత్తర కోస్తా ఆంధ్రప్రదేశ్, యానాంలలో తేలిక పాటి నుండి ఒక మోస్తరు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. అదేవిధంగా దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాలలో ఉరుములతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండు  చోట్ల సంభవించే అవకాముున్నట్లు వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రపంచ కప్-2023 క్రికెట్ లో భాగంగా ఈరోజు హైదరాబద్‌లో న్యూజిలాండ్, నెదర్లాండ్స్ జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది. నెదర్లాండ్స్ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకోగా, కడపటి వార్తలు అందేసరికి నిర్ణీత 50 ఓవర్లకు న్యూజిలాండ్ జట్టు ఏడు వికెట్ల నష్టానికి 322 పరుగులు చేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = =

సిపిఎం ఆధ్వర్యంలో నవంబరు 7న విజయవాడలో ప్రజా రక్షణ భేరి పేరిట భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తెలిపారు. విజయవాడలో ఈ రోజు జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రజారక్షణ భేరికి ముందు రాష్టంలో మూడు ప్రాంతాల నుండి జాతాలు ప్రారంభమవుతాయని తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = = = =